# వెన్నెల !

అతడు ఆ 'సెల్'లోకి విసురుగా వచ్చిపడ్డాడు. తలగోడకి తగిలి కొద్దిగా నుదురు చిట్లింది.

ఇనుప తలుపు మూతపడి తాళం పడింది. ఖాకీ బూట్లు టకటకమంటూ దూరమయ్యాయి. ఇది వరకే ఆ గదిలో వున్న మరో ఖైది అతణ్ణి నిర్లిప్తంగా చూసాడు థర్డ్ డిగ్రీ టార్చరింగ్ విపరీతంగా జరిగినట్టుంది. చావుకి చేరువలో పోతున్నంత అలసిపోయినట్టున్నాడు. పక్కకు జరుగుతూ బాధగా మూలిగాడు.

ఇతడివైపు చూసి దాహమేస్తున్నట్టు సైగ చేసాడు. కూజాలోంచి నీళ్ల గ్లాసులో వొంపి అందించాక గొంతు తడి ఆర్పుకొని బాధగా నిట్టూర్చాడు. 'ఏ నేరం మీద వచ్చావ్ ?' మొదటి ఖైదీ అడిగాడు. ఆ మాటకు కనురెప్పలు పైకెత్తి ఎరుపు జీరలు చిట్లినట్లు క్రోధంగా కళ్ళలో కసి నింపుకొని పిడికిలి బిగించి నేలకు గుద్ది చెప్పాడు. ఆ మాటలో గాంభీర్యం.

"తల్లిని చంపిన నేరానికి...!"

మొదటి ఖైదీ అవాక్కయ్యాడు. అతడి గుండెలో స్కడ్ క్షిపణులు కూలిన విస్ఫోటనాలు...జైలు నాలుగ్గోడల మధ్య తల్లినే తలుస్తూ, ఆరాధిస్తూ తపిస్తూ గడుపుతున్న ఆ ఖైదీకి అతడి మాట నిలువెల్లా కంపింపజేసింది.

"నీ పేరేమిటి ?" లాలనగా అడిగాడు "శివాజీ...." చెప్పాడతడు.

మరోసారి మనసు చివుక్కుమంది. ఏ జిజియాబాయి అతడి గుండెల్లో తలదించుకుందో ?

"నువ్వెందుకొచ్చావ్ ?" ఈసారి అతడడిగాడు.

"తల్లిని బ్రతికించుకోవడానికి" చెప్పాడు

కోపంపోయి అతడి కళ్ళలో అసహ్యపు తెరలు రెపరెపలాడాయి. ఓ సారి ఖాండ్రించి ఉమ్మాడు. టార్చరింగ్‌లో పేగులకేమైనా దెబ్బ తగిలిందేమో...ఉమ్మితోపాటు బుక్కెడు రక్తం కూడా వచ్చింది. అది తుడుచుకుంటూ అడిగాడు.

"నీ పేరేంటి ?"

"పరశురాములు" చెప్పగానే నిర్జీవమైన ఓ నవ్వు పెదవులపైన ఆరుద్ర పురుగులా పాకిపోయింది.

పురాణ చరిత్రలు తారుమారయ్యాయి. అతనిలో అతడే గొణుకున్నాడు.

"జన్మనిచ్చిన తల్లినెందుకు చంపావ్ ?" మొదటి ఖైది బాధగా అడిగాడు. జవాబు చెప్పబోతున్నట్టు తలపైకెత్తి జైలు రాతిగోడల మీద బొగ్గుతో గీసిన బొమ్మల్ని చూసి 'ఆమె ఎవరు ?' అని ఎదురు ప్రశ్న వేసాడు.

" మా అమ్మ...."

ఆ పదం వినగానే అతడు గోడకు చేరగిలబడి నిట్టూర్చాడు. ఆ పదం పోలీసు దెబ్బల్ని మించిన బాధతో గుండెను తొలిచేస్తున్నట్టుంది.

"అమ్మ్... ఛీ ఛీ... ఆమె... ఆమె కోసం నా జీవితమంతా కష్టపడ్డాను. మాతృమూర్తి అన్న గౌరవంతో ప్రేమగా చూసుకున్నాను. కాని ఆ రాక్షసి ఏం చేసింది ?

చిన్ననాడే తను సారాకి బానిసై నన్ను పట్నం వాడికి అమ్మేస్తే పారిపోయి వచ్చికూడా ప్రాధేయపడి ఆమె చెంతనే వుండిపోయాను. మొదలు జేబులు కొట్టి డబ్బు తెమ్మని కొట్టేది. ఆ తర్వాత దొంగతనాలు చేయమనేది. అన్నీ చేసాను. జిల్లేడు చెట్టుకు అల్లుకున్న మల్లె తీగలా ఆమెనే అంటిపెట్టుకొని అన్ని దౌర్జన్యాలు చేసాను.

చివరికి... నేను ప్రేమించిన, నన్నే నమ్ముకున్న ఒక అమ్మాయిని బాంబే తీసికెళ్ళి రెడ్‌లైట్ ఏరియాలో అమ్మి డబ్బు తెమ్మని వేధించినప్పుడు మాత్రం ఆవేశాన్ని ఆపుకోలేకపోయాను. ముక్కలు ముక్కలు చేసాను

అమ్మ...హు... అదో రాక్ష ..."

అంతబాధగా అతడు చెప్పినా కనుకొలనుల్లో ఒక కన్నీటి పుష్పం వికసిస్తూనే వుంది. అతడికి అదో నమ్మలేని నిజంలా వుంది. విస్మయంగా చూస్తుండిపోయాడు.

నవ్వుని కొని తెచ్చుకుంటూ నీ తల్లి కథ చెప్పు వింటాను.అనడిగాడు. మొదటి ఖైది చెప్పటం ప్రారంభించాడు.

"అమ్మ పట్ల నాకు సరైన ప్రేమ లేకపోయినా బుద్ధి తెలిసాక అమ్మ చూపే అనురాగానికి కంపించిపోయే వాణ్ణి. మా నాన్న పోయాక అమ్మ నన్ను తీసుకొని మా చిన్నాన్న చెంతకు చేరింది. ఇద్దర్నీ సాకడానికి మా చిన్నాన్న షరతులు పెట్టాడు. మాకు మిగిలిన ఎనిమిది ఎకరాల భూమిని ఇప్పుడే రాసివ్వాలని. అమ్మ నిస్సహాయంగా అలాగే రాసిచ్చింది. నేను తిరిగి రాత్రి ఏ పన్నెండింటికో వచ్చేవాణ్ణి. కంచంలో అన్నంపెట్టి నా కోసం నిరీక్షిస్తుండేది అమ్మ. అప్పటికే అమ్మ తను తిన్నాను అనేది భూమిరాసిచ్చిన తర్వాత నాకు తెలీకుండా ఆ ఇంట్లో అమ్మతో ఒక ఒప్పందం కుదిరిందట. ఇద్దరికీ ఒక్కపూట మాత్రమే అన్నం పెడతామని. పొద్దున నాకు పెట్టిందాంట్లోనే అమ్మ కొంచెం తీసికొని తినేది. రాత్రి అమ్మ భాగమంతా నా కోసమే ఉంచి ఎదురుచూసేది. ఇలా పస్తులతో బాగా చిక్కిపోయింది. ఒకరోజు చావు బతుకుల్లో హాస్పిటల్లో జాయిన్ చేసాక విధిలేని స్థితిలో నాకు అసలు విషయం చెప్పింది. తాను చచ్చిపోతే నేను ఎలా బతుకుతానోనని బెంగతో విలపిస్తూ చెప్పింది. అంతే భూమిని లాక్కొని అమ్మని బతికించుకోవాలనే ఘర్షణలో చిన్నాన్న చచ్చిపోయాడు.

ఇలా అమ్మకు దూరంగా అనుక్షణం నేను చస్తూ బతుకుతూ ఈ గోడల మధ్య ఉన్నాను.

అమ్మ దేవత". అమ్మ దేవత. అతడు ముఖాన్ని చేతుల్లో కప్పుకొని రోదిస్తుంటే రెండో ఖైది అతడి భుజమ్మీద చేయి వేయబోయి ఆగిపోయాడు. కరడు గట్టిన రోదన కన్నీళ్లయి వెళ్లిపోయాక గదిలోని నిశ్శబ్దాన్ని చీలుస్తూ రెండు గంటల తర్వాత ఆ ఇనుప తలుపు మరోసారి కిర్రుమని తెరుచుకుంది. ముందు లాఠీదెబ్బ విన్పించాక తర్వాత విసురుగా సెల్‌లోకి వచ్చిపడ్డాడు ఓ వ్యక్తి. ఇద్దరి వైపు బిత్తరపోయి చూస్తూ నిల్చున్నాడు. తలుపు మూసుకుంది.

వెళ్తున్న కానిస్టేబుల్ని రెండవ ఖైదీ చప్పట్లు చరిచి పిలిచాడు. కటకటాల వెనకవైపు నించే ఏమిటన్నట్టు అడిగాడు. రెండో ఖైదీ రెండు రూపాయలు తీసి కానిస్టేబుల్ చేతిలో పెట్టి "గురూ సిగరెట్ తాగాలన్పిస్తుంది" అన్నాడు.

కానిస్టేబిల్ మొహం విప్పారింది.

'ఏ సిగరేట్ చార్మినార్...బర్కిలీ...గోల్డ్‌ఫ్లాక్... జనతాబీడి' అనడిగాడు.

చార్మినార్. చెప్పగానే హి.హి. అని నవ్వేసి ఇలా' అవసరాలు పడతాయనే ఆ బిజి: నేనే చేస్తుంటాను. అని టోపీ తీసాడు. టోపికింద రకరకాల సిగరెట్లు. బీడీలు. చార్మినార్ చేతిలో కుక్కి చరచరా వెళ్లిపోయాడు. అతడు సిగరెట్ ముట్టించి...మూడో ఖైదిని అడిగాడు.

"నువ్వెవ్వర్ని చంపావ్ ?"

"ఎవర్ని చంపలేదు. నేనే చచ్చిపోదామనుకున్నాను. అమ్మకోసం!" పిడుగులా వచ్చిన ఆఖరి మాటకి ఆ ఇద్దరూ తుళ్ళిపడ్డారు. వాళ్లు అడక్కముందే మూడో ఖైదీ చెప్పటం ప్రారంభించాడు. అతడికి ఇరవై రెండేళ్ళకు మించి వుండవు". "నాన్న చేసే చిత్రహింసలు భరించకపోయేది అమ్మ. చివరికి ఆ దుర్మార్గుడు ఓ రోజు అమ్మమీద కిరోసిన్ పోసి నిప్పంటించాడు. కాని అమ్మ చాలా తెలివైంది. అదే మంటలతో నాన్నను బలంగా చుట్టేసుకుంది. ఆ మంటల్లో నాన్న కాలిపోయారు అమ్మ మాత్రం హాస్పిటల్లో బతికాక మతి భ్రమించింది. ఆ పిచ్చితో ఊరంతా తిరిగేది నవ్వేది. ఏడ్చేది. నన్ను కూడా కొట్టేది. ఈ మధ్య పిచ్చి ముదిరి రోడ్లంట నగ్నంగా తిరగటం మొదలెట్టింది. స్నేహితుల ఎగతాళి, నా అగచాట్లు నాకు జీవితం మీద రోత పుట్టించాయి. చచ్చిపోదామనుకొని బావిలో దూకెను. ఎవరో రక్షిస్తే ఆత్మహత్య నేరం కింద నన్ను జైల్లో తోసారు. కాని అమ్మ గుర్తొస్తే చాలు గుండె చెరువవుతుంది.

కారణం అమ్మ పిచ్చిది". ఆ యువకుడు మోకాళ్ళ మధ్య తలదాచుకుని ఏడుస్తున్నాడు.

ఆ ఏడ్పు హృదయ విదారకంగా జైలు గోడల్ని తాకి ప్రతిధ్వనిస్తోంది. అప్పటికే సాయంత్రం అవుతూ చీకటి నిశీథి ఆవరించుకుంటోంది. ఆ జైలు గోడల్ని కదిలిస్తే ఎన్నెన్ని ప్రతిధ్వనులు ??

అమ్మ....దేవత !

అమ్మ... రాక్షసి !!

అమ్మ... పిచ్చిది !!!

ఈ సృష్టిలో మాతృత్వం ఏలాంటిదైనా...క్షణికావేశంలో వాళ్లు చేసిన పనికి ఆ జైలు గోడల కావల, ఆ దేవత... ఆ రాక్షసి... ఆ పిచ్చిది... అయిన 'అమ్మ' గుండెలు విలపిస్తూనే ఉంటాయి. తెగిపడ్డ తన పేగుల కోసం!!!

★ ★ ★